క్లుప్తంగా

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సుంకిరెడ్డి నారాయణరెడ్డి



పెద్దవూర: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన సుంకిరెడ్డి నారాయణరెడ్డి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి చేతుల మీదుగా నల్లగొండలో ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో వరుసగా రెండోసారి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రామాల్లోనూ బీజేపీ బలోపేతానికి కృషిచేస్తానని అన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

మిర్యాలగూడ అర్బన్: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు అన్నారు. రంజాన్ ప్రారంభం నేపథ్యంలో సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, వార్డు కౌన్సిలర్లు, హిందూ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేసేలా పండుగలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు జి. సుధాకర్, నాగార్జున, ఎస్‌ఐలు రాంబాబు, కృష్ణయ్య, ట్రాఫిక్ ఎస్‌ఐ మోహన్ తదితరులున్నారు.

రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మిర్యాలగూడ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 400 ఎంపీ సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీకి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ నిరుద్యోగులకు నోటిఫికేషన్లు వేయలేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రజల బాధలు తీరుతాయన్నారు. ప్రజలు ఆలోచించి రఘువీర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాలోతు శివకుమార్, కాసాని విజయ్‌మాదవ్, కృష్ణానాయక్, కుర్ర నాగరాజు యాదవ్, వెంకటేష్, మున్నా, పవన్, బబ్లూ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

చందంపేట: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రూ.3.67 కోట్ల ఉపాధి హామీ పనులపై అధికారులు సోమవారం చందంపేట ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ(ఓపెన్ ఫోరం) నిర్వహించారు. ఉపాధి పనులకు సంబంధించిన అన్ని రికార్డులను చదివి వినిపించారు. ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవకతవకలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అడిషనల్ డీఆర్‌డీఏ నవీన్‌కుమార్ సూచించారు. క్షేత్ర స్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు చేసి కూలీలకు పనులు కల్పించాలన్నారు. పలు గ్రామాలలో జరిగిన పనులకు సంబంధించి రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి, అంబుడ్స్‌మెన్ షౌరీ, ఏపీడీ రవీందర్, ఎంపీపీ నున్సావత్ పార్వతీచందునాయక్, జెడ్పీటీసీ బుజ్జిలచ్చీరాం, ఎస్‌ఆర్‌పీ రమేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వేములపల్లి: ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని ఆర్థిక అక్షరాస్యత ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జగదీష్‌కుమార్ అన్నారు. సోమవారం వేములపల్లిలో ప్రాజెక్టు జిల్లా మేనేజర్ రామలింగయ్యతో కలిసి ఆర్థిక అక్షరాస్యతపై మహిళా సంఘాలకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. మారుతున్న జీవనశైలి ఆధారంగా ప్రతిఒక్కరూ ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా చేయించుకోవాలన్నారు. నెలకొకసారి తమ ఏటీఎం కార్డు వాడడం వల్ల ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షల బీమా వర్తిస్తుందన్నారు. సైబర్ నేరగాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ వేములపల్లి మేనేజర్ దేవరగోపి, ఫైనాన్షియల్ లిటరసీ, కౌన్సిలర్ మాతంగి అనిల్‌కుమార్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి, ఏపీఎం అనూక్, సీసీలు గోపి, రమణయ్య, సురేందర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఘర్షణ

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని గణేషపహాడ్‌లో సోమవారం రాత్రి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. వివరాలు... మహాశివరాత్రి సందర్భంగా గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించేందుకు సిద్ధపడగా కాంగ్రెస్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా బీఆర్‌ఎస్ హయాంలో గ్రామానికి తాగునీటిని అందించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ సైదునాయక్‌పై దాడికి పాల్పడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

వడ్డీ రాయితీతో ఊరట

- ఆస్తి పన్ను బకాయి 10శాతం వడ్డీతో చెల్లిస్తే చాలు
- 90 శాతం వడ్డీ మాఫీ పొందే అవకాశం
- వంద శాతం వసూళ్లకు కార్యాచరణ
- నెలాఖరుతో ముగియనున్న గడువు



హాలియా మున్సిపాలిటీ కార్యాలయం

హాలియా: మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను బకాయిదారులకు ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. మార్చి 31వ తేదీ నాటికి ఉన్న బకాయిలను 10శాతం వడ్డీతో చెల్లించేందుకు అవకాశం కల్పించింది. దీంతో 90 శాతం వడ్డీ మాఫీ కానుంది. వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో హాలియా మున్సిపాలిటీలోని సుమారు 5525 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు చెల్లించాల్సిన ఆస్తి పనుల బకాయిల మొత్తాన్ని పది శాతం వడ్డీతో ఏకకాలంలో చెల్లించి వడ్డీలో 90 శాతాన్ని మాఫీ పొందే అవకాశాన్ని వన్ టైం సెటిల్‌మెంట్ కింద కల్పిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే వడ్డీ రాయితీ మొత్తాన్ని అడ్వాన్స్ రూపంలో వచ్చే ఆర్థిక సంవత్సరం పన్ను నుంచి మినహాయించి ప్రయోజనం చూకూర్చనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. దీని గురించి ప్రచారం చేయడంతో పాటు లక్ష్యాన్ని అధిగమించేందుకు మున్సిపల్ అధికారులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. రికార్డుల ప్రకారం హాలియా మున్సిపాలిటీలో మొత్తం 5525 అసెస్మెంట్స్ ఉండగా రూ. 2.12కోట్ల ఆస్తి పన్ను డిమాండ్ ఉంది. ఇందులో ఇప్పటి వరకు రూ.1.17కోట్లు వసూలు కాగా రూ.95 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక జీఓ జారీ చేసింది. ఇప్పటి వరకు ఆస్తి పన్ను చెల్లించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వంద శాతం పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రతిఒక్కరూ ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

– మున్వర్ అలీ, మున్సిపల్ కమిషనర్, హాలియా

వంద శాతం వసూళ్లే లక్ష్యం..

2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను హాలియా మున్సిపాలిటీలో ఆస్తి పన్ను పెద్ద ఎత్తున వసూలు కావల్సి ఉంది. ఏటేటా పేరుకుపోతున్న బకాయిలు, మున్సిపాలిటీ కి ఇబ్బందికరంగా మారాయి. ఈ క్రమంలో మొండి బకాయిల వసూళ్లపై మున్సిపల్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. 90 శాతం వడ్డీ మాఫీని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా మున్సిపల్ అధికారులు కార్యచరణ రూపొందించారు. వడ్డీ రాయితీపై మెసేజ్‌లు, అవగాహన సదస్సుల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలి



ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి ఆశీర్వచనం చేస్తున్న పూజారులు

హాలియా: ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా పట్టణంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన అష్టబంధన మహాలయ సంప్రోక్షణ మహోత్సవ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తొలిరోజు ఆలయంలో పూజారులు వెంకటాచార్యులు, రమణశర్మ ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, పుణ్యావచనం, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠాపన, ద్వార తోరణ పూజ, మహాసుదర్శన హోమం, విష్ణు సహస్రనామ పారాయణం, మంగళనీరాజనం, తీర్థ గోష్టి తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సాగర్ ఎడమ కాల్వ మాజీ వైస్ చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్, ఆలయ చైర్మన్ మేడేపల్లి మోహన్‌రావు, నాయకులు వెంపటి శ్రీను, వర్కాల శ్రీనివాస్‌రెడ్డి, వర్కాల సుధాకర్‌రెడ్డి, పాంపాటి శ్రీనివాస్, చెరుపల్లి ముత్యాలు, మంద నరేందర్ రెడ్డి, అనుముల అంజి, ఊర వేణు, కాకునూరి చిన నారాయణ, మాధవరం నరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో ఆత్మగౌరవం లేకనే కాంగ్రెస్‌లోకి..



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

డిండి: బీఆర్‌ఎస్‌లో ఆత్మగౌరవం లేకనే ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ డిండి మండల ఉపాధ్యక్షుడు భాదమోని శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు 20 మంది పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్, లక్ష్మణ్, రామలక్ష్మయ్య, శ్రీను, రాములు, చంద్రయ్య, హుస్సేన్, హబీబ్, పర్వతాలు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

చింతపల్లి: హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై వాహనదారులు నిబంధనలు పాటించాలని చింతపల్లి ఎస్‌ఐ యాదయ్య సూచించారు. సోమవారం చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం వద్ద రాష్ట్ర రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడిపినా, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు లేకున్నా చర్యలు తీసుకుంటామని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు ఇవ్వాలని ధర్నా



ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ అర్బన్: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుప్రీం కోర్టుకు సమర్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద గల ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎలక్టోరల్ బాండ్లతో వేల కోట్లు వసూలు చేసిన బీజేపీ తన బండారం బయటపడుతుందనే భయంతోనే వివరాలు వెల్లడించకుండా ఎస్‌బీఐపై ఒత్తిడి చేస్తుందని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్లు తీసుకోని ఏకైక పార్టీగా సీపీఎం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, జగదీష్‌చంద్ర, పోలేబోయిన వరలక్ష్మి, వినోద్‌నాయక్, రొండి శ్రీనివాస్, దేశీరాంనాయక్, పరశురాములు, పాపానాయక్, దయానంద్, ఊర్మిల, పూలమ్మ, వెంకట్‌రెడ్డి, రామ్మూర్తి, మంగారెడ్డి, రామారావు తదితరులున్నారు.

కారు బోల్తా .. ఐదుగురికి గాయాలు

చింతపల్లి : హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడడడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లాకు చెందిన ఐదుగురు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు వెళ్లి సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో నసర్లపల్లి సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్పగాయాలు కాగా వాహనం నుజ్జునుజ్జయ్యింది.

ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి

దేవరకొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.10వేలు జీవన భృతి ఇచ్చి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయడంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 15లక్షల మంది ఆటోల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోకపోతే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొన్నారు. సమావేశంలో తోటపల్లి నగేష్, నూనె వెంకటేశ్వర్లు, జూలూరి వెంకట్రాములు, అలమోని మలయ్య, మంగు, రహీం, శ్రీధర్, కృష్ణయ్య, వెంకటయ్య, శ్రీరామ్, గణేష్ తదితరులున్నారు.

ముగిసిన ఇష్టకామేశ్వరస్వామి ఆలయ జాతర



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పెద్దవూర: మండలంలోని బట్టుగూడెం గ్రామంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన శ్రీఇష్టకామేశ్వరస్వామి ఆలయ జాతర సోమవారంతో ముగిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేకువజామున దేవాలయం ముందు అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం ఆలయ పూజారులు శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అనంత రామశర్మ, నక్కల నాగిరెడ్డి, కూన్‌రెడ్డి శేషిరెడ్డి, రామాంజిరెడ్డి, కూన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, గోవిందరెడ్డి, విజయారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, కొండలు, నక్కల శంకర్‌రెడ్డి, ముస్కు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

యువత గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి. కర్తయ్య అన్నారు. పెద్దవూర మండలంలోని బట్టుగూడెం గ్రామంలో శ్రీఇష్టకామేశ్వరస్వామి ఆలయ జాతర సందర్భంగా నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి గ్రామీణ కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు ఆదివారం రాత్రి బహుమతులు అందించి మాట్లాడారు. మొత్తం 25 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో కల్లూరు జట్టు ప్రథమ బహుమతి(రూ.25 వేలు), మల్లెపల్లి జట్టు ద్వితీయ బహుమతి(రూ.20వేలు), కోదండపురం జట్టు మూడో బహుమతి(రూ.15వేలు),గర్నెకుంట జట్టు నాల్గవ బహుమతి(రూ.12వేలు), బసిరెడ్డిపల్లి జట్టు ఐదో బహుమతి(రూ.10వేలు), బట్టుగూడెం జట్టు ఆరో బహుమతి(రూ.8వేలు) గెల్చుకున్నాయి. విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డులు అందజేశారు. బహుమతి దాతలు, అంపైర్లను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు నక్కల రామాంజిరెడ్డి, కూతాటి దేశ్‌కుమార్, కూన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, పొట్టిపాక కాంతయ్య, మంద శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



పెద్దదేవులపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

త్రిపురారం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తున్నామని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు డి. శ్రీనివాసులు అన్నారు. సోమవారం త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు డాక్టర్ సువర్ణ, జైపాల్‌రెడ్డి సహకారంతో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్లు, విద్యార్థులకు పెన్నులు, స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా డి. శ్రీనివాసులు మాట్లాడారు. సత్యసాయి సేవా సమితి సభ్యులకు పెద్దదేవులపల్లి ఎంపీటీసీ సభ్యుడు అంబటి రాము కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవి కుమార్, సేవాదల్ జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వెంకట్, లక్ష్మయ్య, నర్సింహ, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, ఇనాయతుల్లా, గోవర్ధన్‌రెడ్డి, యువకులు లోకేష్ శర్మ, అమర్‌సింగ్, సైదులు, గణేష్, కోటేష్, నవీన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి



తాళం వేసినట్లు చూపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మిర్యాలగూడ: సమయం ముగియకముందే పాఠశాలలకు తాళం వేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం దామరచర్ల మండలంలోని పుట్టలగడ్డ, తిమ్మాపురం గ్రామాల్లో సమయం ముగియకముందే ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు తాళం వేసి వెళ్లిపోయారని ఆయన ఆరోపించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉందని ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై కూడా పంపారని అన్నారు. అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జగన్, సైదా, వీరన్ననాయక్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వీరభద్రస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: మండలంలోని ముదిగొండ కమలాపూర్‌లో వీరభద్రస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ రథోత్సవానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, సిరాజ్‌ఖాన్, ఎంపీటీసీ జీవన్‌రెడ్డి, జాల నర్సింహారెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండల కేంద్రంలోని రాజరాజేశ్వర దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున రథోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి వెంకటయ్య, ఆదిత్యుని మహేందర్‌శర్మ, ఆదిత్యుని భాస్కర్‌శర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత



హాలియా: కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న మందా నరేందర్‌రెడ్డి



మిర్యాలగూడ: పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న ఎస్‌ఎస్ సేవా సమితి సభ్యులు

మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఐఏఎస్ అధికారి శరత్ సహకారంతో ఎస్‌ఎస్ సేవా సమితి సభ్యులు సోమవారం పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో మట్టపల్లి శ్రీధర్‌గౌడ్, శశిధర్, భైరం గోపి, హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

డిండి మండల కేంద్రంలో..

డిండి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్, కాంగ్రెస్ నాయకులు గడ్డమీది సాయికుమార్, నూకం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

హాలియాలో..

హాలియా: అనుముల మండలం కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్, ఎమ్మార్సీ పాఠశాల, బీసీ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎంఎన్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మందా నరేందర్‌రెడ్డి పరీక్ష సామగ్రి అందజేశారు. చల్మారెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు కంచనపల్లి గోపి, కత్తుల నరసింహ పాఠశాలలో పరీక్ష సామగ్రి అందజేశారు. హాలియా జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ఎన్‌సీఎం ఫౌండేషన్ చైర్మన్, నల్లగొండ పంచాయతీరాజ్ డీఈఈ ఆంజనేయులు పరీక్ష సామగ్రి అందజేశారు. చల్మారెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం దాసా వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ లాక్కోవాలని చూస్తున్నారు..!

- న్యాయం చేయాలని మహిళ వేడుకోలు

మిర్యాలగూడ అర్బన్: తన పేరు మీద ఉన్న గ్యాస్ ఏజెన్సీని తన మామ, అతడి రెండో భార్య కుమారుడు లాక్కోవాలని చూస్తున్నారని మిర్యాలగూడ పట్టణానికి చెందిన అన్నెబోయిన కావ్యశ్రీ ఆరోపించారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని మంజీరా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తన భర్త అన్నెబోయిన శివప్రసాద్ మంజీరా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ పేరుతో 2016లో టెండర్ వేయగా.. టెండర్ వచ్చిందని అన్నారు. కాగా 2022లో అనారోగ్యంతో తన భర్త మృతిచెందడంతో నామినీగా ఉన్న తన పేరు మీద గ్యాస్ ఏజెన్సీ మారిందని తెలిపారు. కాగా తన మామ, అతడి రెండో భార్య కుమారుడు తన నుంచి గ్యాస్ ఏజెన్సీని లాక్కోవాలని చూస్తున్నారని, ఈ విషయంపై పలుమార్లు గొడవలు కూడా జరిగాయని అన్నారు. ఇటీవల తనను వేధింపులకు గురిచేస్తుండడంతో తన మామ, అతడి రెండో భార్య కుమారుడు, కుమారుడి తల్లి, ఆడపడుచులపై మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకుంది.

ఇంటికి వెళ్లి భూమి పట్టా చేయించిన తహసీల్దార్



లాలి ఇంటి వద్ద భూమి పట్టా చేయిస్తున్న తహసీల్దార్ దివ్యారెడ్డి

కొండమల్లేపల్లి: మండలంలోని చెన్నారం గ్రామ పరిధిలోని గన్యనాయక్‌తండాకి చెందిన రమావత్ లాలి అనారోగ్యంతో మంచానికే పరిమితం అయ్యింది. భర్త రమావత్ పూల్‌సింగ్ మరణించడంతో 32గుంటల వ్యవసాయ భూమిని తన పేరిట పట్టా చేయించుకునేందుకు రాలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న కొండమల్లేపల్లి తహసీల్దార్ దివ్యారెడ్డి స్వయంగా సిబ్బందితో కలిసి తండాకు వెళ్లి పట్టా చేయించారు. మానవతా దృక్పథంతో తహసీల్దార్ తండాకు వచ్చి పట్టా చేయించడం పట్ల స్థానికులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట జూనియర్ సహాయకులు శ్రీనివాస్‌యాదవ్, ధరణి ఆపరేటర్ మహేశ్ తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ చోరీ

మిర్యాలగూడ : గుర్తుతెలియని వ్యక్తులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగి తీగలతోపాటు ఆయిల్‌ను చోరీ చేశారు. ఈ ఘటన దామరచర్ల మండలంలో చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు రాజగట్టు గ్రామ సమీపంలోని 25కేవీ సామర్థ్యం గల రెండు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టారు. అందులో నుంచి రూ.40వేల విలువ గల రాగి తీగలు, ఆయిల్‌ను చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న సుదర్శన్

మిర్యాలగూడ: పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. సోమవారం మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భజలాలు అడుగంటి సాగునీరు లేక నల్లగొండ, ఖమ్మం జిల్లాలో వరి పంట పూర్తిగా ఎండిపోయిందని, మిర్చి పంటకు తెగుళ్లు వచ్చి దెబ్బతిన్నాయన్నారు. సాగర్ నుంచి నీటి విడుదల చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే పంటలు ఎండిపోయాయని మండిపడ్డారు. ప్రధానంగా రైతులంతా ఎదురుచూస్తున్న రూ.2 లక్షల రుణమాఫీని ఎప్పుడు అమలు చేస్తారో తేదీని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల బాండ్ల విషయంలో ఎస్‌బీఐ అనుసరిస్తున్న వైఖరి సరైందికాదని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ మోదీ మరోసారి గెలిస్తే దేశం మరింత ప్రమాదంలో పడుతుందన్నారు. దేశానికి కమ్యూనిస్టులు అవసరమని.. ఎన్నికల్లో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు మల్లు గౌతంరెడ్డి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆధార్ సెంటర్ ప్రారంభం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రానికి నూతనంగా మంజూరైన ఆధార్ సెంటర్‌ను సోమవారం విద్యాశాఖ మండల నోడల్ అధికారి శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. నూతన ఆధార్ సెంటర్‌ను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్ నాగేండ్ల వెంకట్‌రెడ్డి, పసుపులేటి కృష్ణ, మహేశ్వరం రాంబాబు, నోవ, మధు, ప్రభాకర్, అశోక్, గోపి, సురేష్, ఆధార్ సెంటర్ నిర్వాహకుడు జూపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

త్రిపురారం: ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో త్రిపురారం మండలంలోని బొర్రాయిపాలెం, అంజనపల్లి, సత్యంపాడు తండా పరిధిలోని నడిమి తండా, రూప్లా తండాలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఎంపీపీ అనుముల పాండమ్మ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవికుమార్, కిషన్‌నాయక్, అవిరెండ్ల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలని వినతి

మిర్యాలగూడ టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ రఘుకు కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త కొంతమందితో కలిసి 6వ వార్డు లేఅవుట్ 1, 2, 3, 4లోని ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంబటి వెంకటకృష్ణ, అంజి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కోటి, లక్ష్మారెడ్డి, నాగరాజు, పల్లె భాస్కర్ తదితరులున్నారు.